
క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో టాయిలెట్ ధ్వంసం


ధ్వంసమైన టాయిలెట్

దుబ్బాకరూరల్: దుబ్బాక ఆర్టీసీ బస్టాండ్‌లో టాయిలెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురౌతున్నారు. టాయిలెట్ ధ్వంసమై రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. వారు స్పందించి టాయిలెట్‌ను బాగు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): దాతల సహకారం మరవలేనిదని ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ అన్నారు. మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో సోమవారం నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి పలువురు దాతలు ఆట వస్తువులు, కుర్చీలు, టేబుల్స్ పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, వార్డు సభ్యులు శేఖర్, భాగ్య శ్రీశైలం, సుజాత యాదగిరి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కొమురయ్య, చిన్నారెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

టీబీని జయించిన మహిళకు సన్మానం


సాయవ్వను సత్కరిస్తున్న సర్పంచ్, ఆరోగ్య సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): టీబీ(క్షయ) సోకిందని తెలిసి కృంగిపోకుండా ప్రభుత్వం అందించిన మందులు వాడి వ్యాధిని జయించిన మహిళను సోమవారం గ్రామస్తులు సన్మానించారు. సిద్దన్నపేటకు చెందిన బొల్లు సాయవ్వకు ఏడాది కిందట క్షయవ్యాధి సోకింది. దగ్గు, ఆయాసంతో బాధపడుతున్న ఆమెకు పరీక్షలు నిర్వహించగా టీబీ సోకినట్లు గుర్తించగా ఆందోళనకు గురైంది. ఆరోగ్య సిబ్బంది సాయవ్వకు మందులు అందజేసి పౌష్టికాహారం తీసుకోవాలని, ఇంట్లో వారికి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆరు నెలల క్రమం తప్పకుండా మందులు వాడి వ్యాధిని జయించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ కనకవ్వ, ఎంపీటీసీ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రవి, వైద్యురాలు అర్చన, రాజేశ్వరి, సూపర్ వైజర్ అబ్దుల్ అలీ, భాస్కర్, సరస్వతి సాయవ్వను శాలువాతో సత్కరించారు.

పైపులైన్ నిర్మాణ పనులు పరిశీలన


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న రుహిన తస్కిన్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రం పరిధిలోని మంజ్యానాయక్‌తండాకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా పైపులైన్ పనులను ఆర్‌డబ్ల్యూ ఎస్ డీఈ రుహిన తస్కిన్ పరిశీలించారు. గత ప్రభుత్వం హయాంలో ఈ తండాకు భగీరథ నీరు అందలేదు. దీంతో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభం కావడంపై సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, తండావాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ హరీశ్, మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, నాయకులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం సిద్ధం

- గ్రామీణులకు చేరువకానున్న వైద్యసేవలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గండిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా గండిపల్లి ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.22లక్షలు, జనగామ, రేగొండ ఆరోగ్య ఉపకేంద్రాలకు కూడా రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో గండిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి కాగా ప్రారంభానికి ముస్తాబైంది. అలాగే జనగామ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా, రేగొండ ఆరోగ్య కేంద్రం పనులు కొనసాగుతున్నాయి.

పల్లె చెంతకే వైద్యం

గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 'పల్లె దవాఖాన'గా అందుబాటులో ఉంచారు. గండిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో గిరిజనతండాలు అధికంగా ఉన్నాయి. గతంలో ఈ తండాల్లో వైద్యసేవలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రాథమిక చికిత్సను అందించడంలో ఈ ఆరోగ్య ఉపకేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం..



గండిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్‌కు చివరి బిల్లు రావాల్సి ఉంది. భవన నిర్మాణ పనులు సక్రమంగా పూర్తి చేశారు. జనగామ, రేగొండ ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణ పనులు కూడా తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం.

– స్నేహ, పంచాయతీరాజ్ ఏఈ

ఎమ్మెల్యేగా ఓడిన వ్యక్తి ఎంపీగా గెలుస్తాడా?

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): పలు పార్టీలు మారిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయాడని, అలాంటివాడు భువనగిరి ఎంపీగా ఎలా గెలుస్తాడని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్ని సార్లు అవమాన పరిచినా గుణపాఠం నేర్చుకోకుండా ఎంపీగా పోటీ చేస్తానని గొంతెమ్మ కోర్కెలు కోరడం తప్ప మరేమీ కాదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిచి తన వ్యాపార ప్రయోజనాలకు ఇచ్చిన విలువ ప్రజలకు ఇవ్వలేదని మండి పడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య, ఆరుట్ల రవీందర్, శ్రవణాచారి, భరత్, పవన్, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాలూకా స్థాయి ముగ్గుల పోటీలు

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తాలూకా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఏ4 సైజ్ పేపర్‌పై రంగు రంగుల ముగ్గులను వేసి నేరుగా లేదా కొరియర్ ద్వారా తమకు పంపాలని, ఎంపికైన వారికి బహుమతులను అందజేస్తామని చెప్పారు. వివరాలకు 98498 47944లో సంప్రదించాలని సూచించారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్


డైరీని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జిల్లా అదనపు కలెక్టర్ కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు జి.తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీఆర్టీయూ క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి పోగ్రాం ద్వారా ఉపాధ్యాయులు మానసికంగా ఒత్తిడికి గురైన సందర్భాలు చాలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): పీఆర్టీయూ క్యాలండర్‌ను మండల అధ్యక్షుడు పులగుర్ల రాంచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రభుత్వం కృషిచేయాలని కోరారు.

గుంతలు.. ఇబ్బందులు



దుబ్బాక నుంచి రామసముద్రం చెరువు కట్ట కింద నుంచి హబ్సీపూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. చెరువు కట్ట నుంచి నీరు లీకైనా, వర్షాలు కురిసినా ఈ రోడ్డు చెవును తలపిస్తోంది. దీంతో ఎక్కడ గుంతలున్నాయో తెలియక వాహనదారులు గుంతల్లో పడి గాయపడ్డారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు.

–దుబ్బాకరూరల్

చెత్తా.. దుర్గంధం..



తెలంగాణ తల్లి చౌరస్తాలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక వైపు ఉన్న డ్రైనేజీ పూర్తిగా చెత్త చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగునీరు నిలిచిపోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రంచేయాలని కోరుతున్నారు.

–దుబ్బాకటౌన్

చదువుతోపాటు క్రీడలూ అవసరమే..


క్రికెట్ కిట్లను అందజేసిన సురేందర్‌రావుతో క్రీడాకారులు

పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు

కొండపాక(గజ్వేల్): చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమేనని పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు సోమవారం కిట్లు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 150 మంది వివిధ రకాల క్రీడాకారులు ఉన్నాయన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ప్రోత్సాహం లేక కొంత మంది విద్యార్థులు అనుకున్న స్థాయికి చేరుకోలేక పోతున్నారని వాపోయారు. క్రీడల్లో రాణించేవారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని సురేందర్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తప్పులకు తావివ్వొద్దు

తహసీల్దార్, ఎంపీడీఓ


రైతు వేదికలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎలాంటి తప్పులు దొర్లకుండా, ఏ అర్జీనీ వదిలి పెట్టకుండా వివరాలను డేటా ఎంట్రీ చేయాలని తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ కొప్పుల సత్యపాలరెడ్డి ఆపరేటర్లను ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం, రైతు వేదికలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల నమోదును సోమవారం వారు పర్యవేక్షించారు. మండలంలో మొత్తం 13,624 దరఖాస్తులు రాగా ప్రస్తుతం 5,613 దరఖాస్తులను నమోదు చేశామని తహసీల్దార్ చెప్పారు. 12లోగా డేటా ఎంట్రీ పూర్తిచేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కవికుమార్, ఏపీఓ ప్రభాకర్, సూపరిండెంట్ శంకరయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ


గజ్వేల్‌రూరల్: సంచార జాతుల ప్రజలకు అక్షింతలను పంపిణీ చేస్తున్న సువీర్


బెజ్జంకి(సిద్దిపేట): రామసాగరంలో..

జిల్లా వ్యాప్తంగా అయెధ్య శ్రీరాముని పూజిత అక్షింతల పంపిణీ కొనసాగుతోంది. సోమవారం పలుమండలాలోని గ్రామాల్లో రామ భక్తులు పాదయాత్రలు నిర్వహించి ఇంటింటికీ అక్షింతలను అందజేశారు.

– సాక్షి బృందం

- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న వలస తెగల ప్రజలకు తెలంగాణ సంచార తెగల ప్రచారక్ సువీర్ అయోధ్య పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేంద్ర, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా బాధ్యుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, నర్సింహారావు, లక్ష్మణ్, ఆంజనేయులు, దశరథరాములు తదితరులు పాల్గొన్నారు.
- వర్గల్ మండలం నెంటూరు, చాంద్‌ఖాన్‌మక్తలో సోమవారం ఇంటింటికీ అయోధ్య అక్షితలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.
- బెజ్జంకి మండలంలోని దాచారం శివారులోని రామసాగరంలో అయోధ్య బాలరాముని ప్రతిష్ఠ అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింతల కలశాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో అర్జున్, తిరుపతి, రామారావు, నాగమల్లేశం, కేశవ్, హిందువాహిని మండల సంయోజక్ వీరేశం పాల్గొన్నారు.
- చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, విఠలాపూర్, అల్లీపూర్, గంగాపూర్ గ్రామాల్లో శ్రీరామ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బుస్స నరేశ్, రామభక్తులు పాల్గొన్నారు.
- నంగూరులో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలకు స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- కుకునూరుపల్లి మండల కేంద్రంలో అయోధ్య నుంచి తెప్పించిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భక్తులు కాచం నవీన్, ఉప్పల పాండురంగం, ఉప్పల రాజు మాట్లాడుతూ అయోధ్యలో హిందువుల ఆరాధ్యదైవమైన రాముని మందిరం నిర్మించడం మర్చిపోలేనిదన్నారు. కార్యక్రమంలో రామ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): ఇబ్రహీంనగర్‌లో..


నంగునూరు(సిద్దిపేట): బద్దిపడగలో..


కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో..

సంక్షిప్త వార్తలు

◆ నేడు గోదారంగానాథ కల్యాణం

నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలోని వెంకటేశ్వరాలయంలో మంగళవారం గోదా రంగనాథ స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సిద్దిపేట వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఊరేగింపు, స్వామివారి ఉత్సవ విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని పూజారి డింగరి విష్ణుతేజాచార్యులు కోరారు.

◆ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్ మంక్యనాయక్, ఉపాధ్యక్షుడిగా ఆర్.వి.రత్నం, ప్రధానకార్యదర్శిగా రత్నకుమార్, కార్యదర్శిగా కత్తుల మోజెస్, కోశాధికారిగా ప్రేమానందం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ సన్మాన సభను జయప్రదం చేయండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): టీయూడబ్ల్యూజే(ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరహత్‌అలీకి 10వ తేదీన గజ్వేల్‌లోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సన్మాన సభను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి, ఐజేయూ సభ్యులు బాల్‌నర్సయ్య కోరారు. సభకు మేధావులు, కవులు, వివిధ సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సభ్యులు నర్సింలు, పరశురాం, బలరాం తదితరులు ఉన్నారు.

◆ ఏబీవీపీ నూతన నగర కమిటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేటశాఖ ఆధ్వర్యంలో నగర మహాసభలు జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విభాగ్ సంఘటనా మంత్రి బోడ లక్ష్మణ్ హాజరయ్యారు.



ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ నిరంతరం విద్యార్థుల సమస్యల కోసమే కష్టపడుతుందన్నారు. అనంతరం సిద్దిపేట నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా వర్దోలు హరీశ్, ఉపాధ్యక్షుడిగా నవీన్, సంయుక్త కార్యదర్శిలుగా రాకేశ్, సతీశ్‌ను ఎన్నుకున్నారు.

◆ విద్యుత్ వినియోగదారులకు అవగాహన

దుబ్బాక: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పదో తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏడీఈ రాంబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక హబ్సీపూర్ రోడ్ విద్యుత్ ఉపకేంద్రం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు, కరెంటు బిల్లును తీసుకొని రావాలని సూచించారు.

సందడిగా స్వయం పరిపాలన దినోత్సవం



అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ సహచర విద్యార్థులందరికీ పాఠాలు బోధించారు. అనంతరం వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, శ్రీనివాస్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల విహార యాత్ర



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల విహార యాత్ర ఉత్సాహంగా సాగింది. సోమవారం చంద్లాపూర్ శివారులోని రంగనాయకస్వామి గుట్ట, రిజర్వాయర్ తదితర ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. రిజర్వాయర్ ప్రాముఖ్యత, దేవాలయం విశిష్టత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రాములు, సురేశ్, కుమార్, సునీత, దేవకి, వాణి తదితరులు పాల్గొన్నారు.